ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

- విద్యాలయాల్లో ప్రతిభా పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

గణిత దినోత్సవంలో మానేరు విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 22: జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో శుక్రవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని పారమిత విద్యాసంస్థల ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించగా, విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాద రావు, డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జంగ సునీత-మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. సాధన, వివేకానంద విద్యానికేతన్, అద్వైత పాఠశాలల్లో గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. ప్రదర్శనలను విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య తిలకించి విద్యార్థులను అభినందించారు. బోయవాడలోని శ్రీ చైతన్య పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ పద్మజ పూల మాల వేసి, నివాళులర్పించారు భగవతి, ఆర్విన్‌ట్రీ పాఠశాలల్లో రామానుజన్ చిత్రపటానికి చైర్మన్ రమణారావు, కరస్పాండెంట్ విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ వీ రవీందర్ రెడ్డి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.

మానకొండూర్, డిసెంబర్ 22: మండల కేంద్రంలోని చాణక్య ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి కరస్పాండెంట్ ఆడెపు రవీందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైదాపూర్, డిసెంబర్ 22: మండలకేంద్రంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం పాఠశాలతో పాటు ఆకునూర్ కస్తూర్బా విద్యాలయం, పలు ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధర, డిసెంబర్ 22: లక్ష్మీదేవిపల్లిలోని నరేంద్ర పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల యాజమాన్యం గంగాధర రాజేశం, గుజ్జుల గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిగురుమామిడి, డిసెంబర్ 22: బొమ్మనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణిత ఉపాధ్యాయులు రాజమౌళి, శంకర్ ఆధ్వర్యంలో క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 22: మండలంలోని సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, తుమ్మనపల్లిలోని ఏకశిల సీబీఎస్ పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎన్ హనుమకుమార్, ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి గణితం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో పాఠశాల ప్రిన్సిపాల్ చిదురాల దినేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నూతి కిరణ్మయి, స్టాఫ్ ఇన్‌చార్జి డీ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 22: పట్టణంలోని విజ్ఞాన్ నెక్స్ట్‌జెన్, వివేకవర్ధిని పాఠశాలల్లో గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల చార్టులు, మోడల్స్ ప్రదర్శించారు. ఆ తర్వాత క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు పాఠశాలల నిర్వాహకులు బహుమతులను అందించారు. గణిత ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్స్ దాసరి కోటేశ్వర్, మాడిశెట్టి ప్రసాద్, విజ్ఞాన్ పాఠశాల ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, డైరెక్టర్ తిరుపతియాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరపట్నం, డిసెంబర్ 22: మండలంలోని మొలంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గణితశాస్త్ర ఫజిల్స్, గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం నీరజారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు దేశ్‌ముఖ్, బొప్ప రాజు రమేశ్, బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లి, డిసెంబర్ 22: కరీంనగర్‌లోని మానేరు పాఠశాలలో ఏర్పాటు చేసిన గణిత ప్రదర్శనను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి అద్భుతమైన గణిత ప్రదర్శనలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే, రాంనగర్‌లోని మానేరు గ్లోబల్ స్మార్ట్ కిడ్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు పేరెంట్స్ మీట్ పేరిట అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా, విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, నాటిక, ఫ్యాషన్ షో, తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

చొప్పదండి, డిసెంబర్ 22: మండల కేంద్రంలోని వీణాధరి ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆంజనేయులు, మల్లేశం, చంద్రశేఖర్, మహేందర్, మధుసూదన్, శైలజ, సత్యనారాయణ రెడ్డి, సీమాత బస్సు, సరిత, కవిత, సాహితీ, అనూష, లావణ్య, సుప్రియ, సువర్ణ, సౌమ్య, తేజ, లక్ష్మీమాల, విద్యార్థులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్, డిసెంబర్ 22: మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి కరస్పాండెంట్లు బర్మయ్య, జితేందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌టౌన్: విజ్ఞాన్ పాఠశాలలో గణిత దినోత్సవం సందర్భంగా రూపొందించిన ప్రత్యేక చార్టులు, మోడల్స్‌తో విద్యార్థులు

హుజూరాబాద్ రూరల్: తుమ్మనపల్లిలోని ఏకశిల పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నిబంధనల మేరకే పనులు

- రికార్డులను ఎప్పుడైనా వెరిఫికేషన్ చేసుకోవచ్చు
- బల్దియా పాలకవర్గంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్న మాజీ మేయర్ రవీందర్ సింగ్
- నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

మాట్లాడుతున్న మేయర్ వై సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 22: నగరంలో సీఎం అస్యూరెన్స్ నిధులు రూ. 132.94 కోట్లతో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సీనరేజ్ పైపులైన్ పనులను నిబంధనల మేరకే చేపడుతున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు స్పష్టం చేశారు. నగరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో చేపడుతున్న పనుల్లో నాణ్యతా విషయంలో రాజీ పడడం లేదన్నారు. నగర అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తుంటే, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ కావాలని ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం గత మే 24న రూ.132.94 కోట్లను సింగిల్ ప్యాకేజీ కింద అడ్మినిస్ట్రేషన్ మంజూరు ఇచ్చిందన్నారు. జూలై 12న ఈఎన్‌సీ నుంచి టెక్నికల్ మంజూరు తీసుకొని 18న టెండర్లు పిలిచామన్నారు. ఆగస్టు 14న టెండర్లు ఓపెన్ చేయగా మూడు ఏజెన్సీలు మాత్రమే పాల్గొన్నాయని, అవి ఎక్స్‌రేట్స్‌కు టెండర్లు వేశాయన్నారు. దీంతో వాటిని రద్దు చేసి రీకాల్ చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 13న రెండోసారి టెండర్లు పిలిచి 22న ఓపెన్ చేశామన్నారు. ఇందులో శ్రీ రాజరాజేశ్వర కన్‌స్ట్రక్షన్స్ సంస్థ మాత్రమే 20 శాతం లెస్‌తో టెండరు వేసిందని, ఆ మేరకు కమిషనర్ ఆఫ్ టెండర్స్ 29న అనుమతి ఇచ్చిందన్నారు. ప్రభుత్వం శ్రీ రాజరాజేశ్వర కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు అక్టోబర్ 5న జీవో నంబర్ 781 జారీ చేసి పనులను అప్పగించేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. అక్టోబర్ 6న పనులకు ఎల్‌వోసీ జారీ అయిందని, దీనికి సంబంధించి రూ.103.02 కోట్లకు అగ్రిమెంట్ జరిగి అన్ని కట్టింగ్‌లు పోనూ రూ. 102.82 కోట్ల పనులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. అక్టోబర్ 7న సీఎం అస్యూరెన్స్ నిధులకు సంబంధించి పనులను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం పనులు కొనసాగుతుండగా బిల్లులు రికార్డింగ్ ప్రాసెస్‌లో ఉన్నట్లు తెలిపారు. బల్దియా పరిధిలో సీఎంఏ నిధులకు సంబంధించిన రూ.48 కోట్ల పనులు జరిగినట్లు అంచనా వేశామని, మిగతా అభివృద్ధి పనులు అండర్ ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. సీఎం అస్యూరెన్స్ నిధులకు సంబంధించిన పనులకు పారదర్శకంగా టెండర్లు పిలిచి, ప్రభుత్వ అనుమతి తీసుకొని చేస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యతలో రాజీ లేకుండా, టెండర్లలో ఎలాంటి గందరగోళం లేకుండా చేస్తుంటే తమ పాలకవర్గం పనితీరుపై బురదజల్లే ప్రయత్నం చేయడం రవీందర్‌సింగ్‌కు సరికాదన్నారు. ఇలాంటి పనులను మానుకోవాలని హితవు పలికారు. దీనికి సంబంధించి ఏ విషయంలోనైనా క్లారిటీ కావాలంటే నగరపాలక సంస్థలో అన్ని రికార్డులు ఉన్నాయని, అవసరమైతే వెరిఫికేషన్ చేసుకోవచ్చని సవాల్ చేశారు. ఎక్కడ కూడా ఆన్‌లైన్‌లో రికార్డు చేయలేదని, మేజర్‌మెంట్ బుక్ ప్రకారం పనులకు సంబంధించిన బిల్లులు రికార్డు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రవీందర్‌సింగ్ కావాలని ఇలాంటి ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కేడీసీసీబీ సేవలు భేష్

- రైతులకు సేవలందించడంలో దేశానికే ఆదర్శం
- ఏపీ కోఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

విద్యానగర్, డిసెంబర్ 22: రైతాంగానికి మెరుగైన సేవలందించడంలో కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని ఏపీ రాష్ట్ర సహకార బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి ప్రశంసలు కురిపించారు. శుక్రవారం కేడీసీసీబీని అప్కాబ్ చైర్‌పర్సన్‌తో పాటు ఏపీలోని డీసీసీబీ చైర్మన్లు, ఇతర అప్కాబ్ అధికారులు సందర్శించారు. కరీంనగర్‌లోని ప్రధాన శాఖకు వెళ్లి వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. వీరికి నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు కేడీసీసీబీలో అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ, కంప్యూటరైజేషన్‌లో కరీంనగర్ సొసైటీ ముందువరుసలో నిలిచిందని అభినందించారు. ఈ సొసైటీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్తామని, డిపాజిట్లు పెంచేందుకు సహకార ప్రచారాన్ని ప్రారంభించామన్నారు. ఖాతాదారులకు ఉచితంగా రూపే కార్డులను అందిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు కొండూరిని సంప్రదిస్తూ సలహాలు సూచనలు తీసుకుంటున్నామని చెప్పారు. 2005 నుంచి చైర్మన్ రవీందర్‌రావు నేతృత్వంలో చేపట్టిన విజయాలపై సీఈవో సత్యనారాయణరావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. వైస్ చైర్మన్ రమేశ్, జనరల్ మేనేజర్లు ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు, చిత్తూరు, ఎలూరు, డీసీసీబీ చైర్మన్లు పాల్గొన్నారు.

ఎంపీల సస్పెన్షన్‌పై కాంగ్రెస్ కూటమి నిరసన

నగరంలోని తెలంగాణచౌక్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు

రాంనగర్, డిసెంబర్ 22: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తూ పార్లమెంట్‌లో ఎంపీలను అప్రజాస్వామికంగా సస్పెండ్ చేయడంపై కాంగ్రెస్ కూటమి ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణచౌక్‌లో శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా 146 మంది విపక్ష ఎంపీలను మోదీ ప్రభుత్వం సస్పెండ్ చేసి నియంతృత్వ పోకడలను ప్రదర్శించిందని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి నియంతృత్వం పనికిరాదని ఏఐసీసీ, ఇండియా కూటమి సభ్యులు నిరసనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం నగర కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు కర్ర సత్యప్రసన్న ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి తెలంగాణచౌక్‌లో నిరసన తెలిపారు. ఇండియా కూటమి సభ్యులు సీపీఐ, సీపీఎం నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, మర్రి వెంకటస్వామి, ముకుందరెడ్డి, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ర్యాలీ తీస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి

ఎంపీలను సస్పెండ్ చేయడం సరికాదు

తెలంగాణచౌక్, డిసెంబర్ 22: కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్షాల ఎంపీలను అకారణంగా సస్పెండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో నిరసన ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, సదాశివ, సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, నగర కార్యదర్శి గుడికందుల సత్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి శోభాయాత్ర

వీణవంక, డిసెంబర్ 22: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో శుక్రవారం గురుస్వామి గంగాడి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి శోభాయాత్రను మాలధారులు వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి విగ్రహాలను రథంపై గ్రామ వీధుల్లో ఊరేగించగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాడి సౌజన్య-తిరుపతిరెడ్డి, భక్తులు సింగిరెడ్డి మల్లారెడ్డి, రామగిరి సంపత్, బుర్ర సాయి, మద్దుల సంపత్, నల్ల సమ్మిరెడ్డి, వంగల శ్రీనివాస్‌రెడ్డి, మడుగూరి తిరుపతిరెడ్డి, నల్ల రాజిరెడ్డి, రవియాదవ్, రమేశ్, అశోక్‌రెడ్డి, మురారి, రాజ్‌కుమార్, నల్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ కృషి గొప్పది

కలెక్టరేట్, డిసెంబర్ 22: తెలంగాణ అభివృద్ధికి తొలి సీఎం కేసీఆర్ చేసిన కృషి ఎంతో గొప్పదని మైనార్టీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి హుస్సేన్ అలం పేర్కొన్నారు. నగరంలోని కార్ఖానాగడ్డలో గల సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు సయ్యద్ సలీం, మహ్మద్ రజాక్, ఇబ్రహీం, సద్గురు, భుజేందర్‌సింగ్, ఇక్బాల్ పాల్గొన్నారు.

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు

జమ్మికుంట, డిసెంబర్ 22: వ్యవసాయ మార్కెట్ యార్డుకు వరుసగా నాలుగు రోజుల సెలవులని కార్యదర్శి జీ రెడ్డినాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం, ఆదివారం సాధారణ సెలవని, సోమవారం క్రిస్మస్, మంగళవారం బాక్సింగ్ డే సందర్భంగా మార్కెట్‌కు బంద్ ఉంటుందని, రైతులు గమనించాలని పేర్కొన్నారు. బంద్ రోజుల్లో రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని తెలిపారు.

ఎన్నికల ఖర్చుల వివరాలు పూర్తి చేయాలి

కలెక్టరేట్, డిసెంబర్ 22: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు చేసిన ఖర్చుల వివరాలు ఈనెల 29లోగా పూర్తి చేసి, ఎన్నికల వ్యయ పరిశీలకుడికి పంపించేందుకు సిద్ధంగా ఉంచాలని జిల్లా సహకార అధికారి ఎస్ రామానుజాచార్య సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లకు ఎన్నికల వ్యయ వివరాల సమర్పణపై శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం సూచించిన ఫార్మాట్‌లో మాత్రమే వివరాలు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ వ్యయ పరిశీలకుడు మనోజ్‌కుమార్, ఏఈవో జోయల్, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

'ఈజీఎస్ పనుల బిల్లులు చెల్లించాలి'

సైదాపూర్, డిసెంబర్22: గ్రామ పంచాయతీకి సంబంధించి ఉపాధిహామీ పథకంలో భాగంగా చేసిన పనులను రికార్డుచేసి బిల్లులు చెల్లించాలని ఎలబోతారం సర్పంచ్ మ్యాకల శిరీష భర్త మ్యాకల సంపత్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఎలబోతారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈజీఎస్ గ్రామసభలో ఆయన టెక్నికల్ అసిస్టెంట్‌తో మాట్లాడారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎందుకు రికార్డు చేయడం లేదని ప్రశ్నించారు. తమకు సుమారు రూ.3లక్షల బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఈజీఎస్ ఏపీవో అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

నియామకం

శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేస్తున్న రవి

తిమ్మాపూర్, డిసెంబర్ 22: మండలంలోని మహాత్మానగర్ గ్రామానికి చెందిన దైవాల శ్రీకాంత్ యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చెన్నబోయిన రవి నియామక పత్రం అందజేశారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

వీణవంక, డిసెంబర్ 22: హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన రైతు మ్యాక శ్రీనివాస్ (40) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ వ్యవసాయ అవసరాల కోసం రూ.8 లక్షల అప్పు చేశాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఈ నెల 21న రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా, శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చొప్పదండి(రామడుగు), డిసెంబర్ 22: రామడుగు మండలం రుద్రారం గ్రామానికి చెందిన జగన్నాథ సత్యనారాయణ శుక్రవారం మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. అలాగే, వన్నారం గ్రామానికి చెందిన తౌటు రాము మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

కలెక్టర్‌ను కలిసిన సీపీఐ నాయకులు

తెలంగాణచౌక్, డిసెంబర్ 22: కలెక్టరేట్‌లోని కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతిని శుక్రవారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. వారివెంట విశ్రాంత ఉద్యోగి జనార్దన్‌రావు ఉన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, డిసెంబర్ 22: కేరళ రాష్ట్రంలోని కాళికట్ విశ్వవిద్యాలయంలో ఈనెల 26 నుంచి జరిగే అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో పోటీలకు వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి వీర విష్ణువర్ధన్‌రెడ్డి ఎంపికైనట్లు పీడీ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. వీర విష్ణువర్ధన్‌రెడ్డిని కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ అభినందించారు.

నేటితో ముగియనున్న ఉపాధి గ్రామసభలు

కలెక్టరేట్, డిసెంబర్ 22: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లోని పేదలకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కల్పించేందుకు అవసరమైన ప్రణాళికల రూపకల్పన జిల్లాలో మొదలైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ గ్రామాల్లో పనుల గుర్తింపు ప్రక్రియ పక్షం రోజుల క్రితం ప్రారంభమై, నేటితో ముగియనుంది. జలవనరుల అభివృద్ధే లక్ష్యంగా రాబోయే ఆర్థిక సంవత్సరంలో పనులు చేపట్టేందుకు నిర్ణయించిన అధికారులు, ఆ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలోని గ్రామాల్లో కొద్దిరోజులుగా ఏపీవోలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యటిస్తూ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు అవసరమయ్యే విధంగా చేపట్టేలా పనులు గుర్తిస్తున్నారు. మండలాల వారీగా సిద్ధం చేసిన పనుల వివరాలతో కూడిన నివేదికలు ఈనెల 30లోగా జిల్లా అధికారులకు అందజేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1,22,505 జాబ్‌కార్డులు ఉండగా వీటిలో 66,973 మంది కూలీలకు 18,17,523 రోజులు పని కల్పించారు. వీరిలో 2,893 కుటుంబాలు వంద రోజులు పని చేశాయి. వీరందరికీ ఇప్పటి వరకు రూ.38.16 కోట్ల పైచిలుకు కూలి చెల్లించారు. ప్రధానంగా ఊర చెరువులు, పూడికతీత, పామ్ పాండ్స్ నిర్మాణాలు, హరితహారం, భూ అభివృద్ధి పనులు, చిన్న నీటి కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణాలు, ముళ్ల పొదల తొలగింపు, తదితర పనులు చేపడుతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈసారి కంటే అధికంగా పనులు గుర్తించాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించడంతో యుద్ధప్రాతిపదికన గ్రామసభలు పూర్తి చేస్తున్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ప్రజలు, కూలీల భాగస్వామ్యంతో అధిక మందికి పని కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గుర్తించిన పనులన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగా, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల వారీగా గుర్తించిన పనుల జాబితాలు రూపొందిస్తున్నారు. వీటిని తుది పరిశీలన కోసం కలెక్టర్‌కు పంపనుండగా, అక్కడ ఆమోదం పొందిన అనంతరం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

హుజూరాబాద్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 22: పట్టణంలో రెండు చోట్ల అక్రమ నిర్మాణాలను డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్(డీటీఎఫ్) ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చి వేశారు. పట్టణంలోని వరంగల్‌రోడ్‌లో హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట నివసించే గన్నారపు భాస్కర్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం కోసం పిల్లర్లు, ప్రహరీ నిర్మించగా, జమ్మికుంట రోడ్డులో గెలాక్సీ సూపర్ మార్కెట్ పక్కన విజయ అనే మహిళ రోడ్డును ఆక్రమించుకొని ప్రహరీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో నోటీసులు ఇచ్చినప్పటికీ వారు స్పందించకపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో వాటిని కూల్చి వేసినట్లు బల్దియా టీపీఎస్ అశ్వినిగాంధీ తెలిపారు